

రెబ్బెన గ్రామసభలో అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

● గ్రామసభల్లో గందరగోళం

డే-1

# నిరసనలు.. నిలదీతలు

## ప్రజాపాలన గ్రామసభల్లో అధికారుల తీరుపై జనం మండిపాటు

- అనర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంపై అసహనం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలుచోట్ల గందరగోళంగా సభలు
- అర్హుల పేర్లకు బదులు అనర్హుల పేర్లు రావడంపై ఆందోళన
- ప్రభుత్వ యంత్రాంగం, ప్రజల మధ్య తీవ్ర వాగ్వాదం
- దరఖాస్తులను ఎన్నిసార్లు ఇవ్వాలంటూ ఆగ్రహం
- చాలా చోట్ల గ్రామసభల నుంచి వెళ్లిపోయిన జనం
- కొన్నిచోట్ల సభలు నిర్వహించకుండానే వెళ్లిన అధికారులు
- పలు గ్రామాల్లో పోలీసు బందోబస్తు మధ్య సభల నిర్వహణ

### రేషన్ కార్డులో పేరు రాలేదు..



రేషన్ కార్డుకు నేను అన్ని విధాలుగా అర్హుడిని. నా పేరు లిస్ట్‌లో రాలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకున్న. ఇలా ప్రతిసారి దరఖాస్తు చేసుకోవడమే తప్ప లిస్టులో పేరు మాత్రం రావడం లేదు. ఇలా ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలో అర్థం కావడం లేదు. మాసోంటి గరీబోల్ల పేర్లు కూడా జాబితాలో రాకపోతే ఎలా? ఈ సర్కారు, అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

- మేర భాస్కర్ దంపతులు

### పదేండ్లుగా కిరాయి ఇంట్లో ఉంటున్నా..



నేను కూలీ పని చేసుకుంటూ ఉపాధి పొందుతా. కష్టపడి పనిచేసి సొంత జాగా కొనుగోలు చేశా. పదేండ్లుగా కిరాయి ఇంట్లో ఉంటున్న. నేను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఆదిలాబాద్ మన్సిపాలిటీలో ఆరో వార్డు పరిధిలోకి మా కాలనీ వస్తుంది. ఈ రోజు పెట్టిన లిస్ట్‌లో మా పేరు రాలేదు. అధికారులను అడిగితే మరోసారి దరఖాస్తు ఇవ్వమన్నారు. దరఖాస్తులు జిరాక్స్ సెంటర్‌లో ఉంటాయని అంటున్నారు.

- సోహల్, ఇందిరమ్మ కాలనీ, ఆదిలాబాద్

### ఇంటి పన్ను కడితేనే దరఖాస్తు తీసుకుంటారట



హాజీపూర్, జనవరి 21 : నాకు వివాహమై ఏడేండ్లు అయితాంది. నాకు ఇద్దరు ఆడ పిల్లలు, కూలీ పని చేసుకుంటూ బతుకుతున్నాను. ఇంత వరకు రేషన్ కార్డు రాలేదు. నాకు ఇల్లు కూడా లేదు. మా అమ్మా, నాన్న ఇంట్లో ఉంటున్నా, ఇంటి పన్ను ఎనిమిది వేలు బకాయి ఉన్నది. మొత్తం కడితేనే నీ దరఖాస్తు తీసుకుంటానని గ్రామ కార్యదర్శి దరఖాస్తు తీసుకోలేదు. ఇప్పుడు డబ్బులు లేవు, మేడం తరువాత కడుతానని చెప్పినా తీసుకోలేదు. అధికారులు నాకు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలి.

-చౌతకారి నవీన్, ఒనూర్ (హాజీపూర్)



బెల్లంపల్లి : అధికారులను నిలదీస్తున్న కన్నాల బస్తీవాసులు



ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఆరో వార్డులో గల సేవాదాస్ స్కూల్‌లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజాపాలనలో ఈ వార్డు నుంచి ఇందిరమ్మ ఇండ్లకు 650 మంది, రేషన్‌కార్డులకు 260 మంది దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం నిర్వహించిన గ్రామసభలో 65 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 143 మంది పేర్లతో కూడిన జాబితాను ప్రదర్శించారు. రేషన్‌కార్డులను ఈ నెల 26 నుంచి పంపిణీ చేస్తామని ప్రకటించినా.. ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడుతలో కేవలం ఆరుగురికి మాత్రమే కేటాయించారు. జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో వార్డు ప్రజలు మరోసారి దరఖాస్తు ఇవ్వడానికి గ్రామసభలో బారులు తీరారు.



దహెగాం : కల్వాడ గ్రామసభలో గ్రామస్తులకు నచ్చజెబుతున్న పోలీసులు

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభల్లో అధికారులకు నిలదీతలు, నిరసన సెగలు తగిలాయి. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 24వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో వార్డులవారీగా సభలు నిర్వహించనున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు, జిరాక్స్‌ల కోసం జనం పరుగులు తీశారు. దరఖాస్తు ఫారాల కొనుగోలు కోసం రూ.30 వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని దరఖాస్తుదారులు తెలిపారు.

#### ఇది నిరంతర ప్రక్రియ

జనం నుంచి వ్యతిరేకత రావడం, గ్రామసభల్లో అధికారులను నిలదీస్తున్న నేపథ్యంలో చాలా గ్రామాల్లో పోలీసులను మోహరించి సభలు నిర్వహించారు. కొన్ని సభల్లో అధికారులతో పాటు పోలీసులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం వచ్చింది ఒక జాబితానేనని, అర్హులందరినీ న్యాయం జరుగుతుందని, ఈ దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని పలుచోట్ల అధికారులు ప్రజలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేయాలి. ఆరు గ్యారెంటీల కోసం ఒకసారి, సమగ్ర కుటుంబ సర్వేప్పుడు మరోసారి.. ఇప్పుడు గ్రామసభల్లోనూ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం ఏంటని జనాలు అధికారులను నిలదీశారు. అసలు చేసిన దరఖాస్తులను పట్టించుకుంటున్నారా? లేదా? ఈసారి గ్రామసభల్లో చేసిన దరఖాస్తులైనా పరిగణలోకి తీసుకుంటారా? లేదా? చెప్పాలంటూ మండిపడ్డారు. ఒక్క పథకానికి ఇన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాల్సి రావడంపై అసహనం వ్యక్తం చేస్తూ జనాలు సభల నుంచి వెనుతిరగడం కనిపించింది.



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బంబార గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన జాబితాలో పేరు లేకపోవడంతో రోదిస్తున్న నూతి జ్యోతి

### సభలో కన్నీరు పెట్టుకున్న మహిళ

వాంకిడి మండలంలోని బంబార గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో నిరుపేద కుటుంబానికి చెందిన ఒంటరి మహిళ నూతి జ్యోతి తన పేరు లేకపోవడంతో గ్రామసభలో కన్నీరు పెట్టుకున్నది. పూరిగుడిసెలో కుమారుడితో ఒంటరిగా ఉంటూ కూలీ పనులు చేసుకునే తనకు ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించి పథకాలు అందేలా చుడాలని కోరింది.

### ఆందోళనలు ఇలా..

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో జరిగిన సభల్లో స్థానిక ప్రజలు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది.
- మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని పోలంపల్లి గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల పేర్లు రాకుండా అనర్హుల పేర్లు వచ్చాయంటూ గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. గ్రామంలో నివాసం ఉండని వారి పేర్లు, భూములు, ఆస్తులు ఉన్న వారి పేర్లు వచ్చాయంటూ సభకు వచ్చిన జనం గొడవకు దిగారు. గ్రామసభను బహిష్కరిస్తామని ఆందోళన చేశారు. అధికారుల వినతి మేరకు ఎంఆర్‌వోకు రీ-సర్వే చేయాలని లెటర్ రాసి ఇచ్చారు.
- ఇదే మండలంలోని ఎల్కేశ్వరంలో రేషన్ కార్డుల కోసం అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. కాజీపల్లి, కొత్తపెల్లి గ్రామాల్లోనూ అధికారులకు నిరసన సెగ తగిలింది.
- జన్నారం మండలంలోని తపాలాపూర్ గ్రామసభలో అధికారులను స్థానికులు నిలదీశారు. దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో రాలేదని, దీనికి కారణం ఏంటో చెప్పాలని ప్రశ్నించారు.
- ప్రజాపాలన గ్రామసభలు కన్నెపల్లి, భీమిని మండలాల్లోని పలు గ్రామసభల్లో తమ పేర్లు జాబితాలో ఎందుకు రాలేదని అధికారులను గ్రామస్తులు నిలదీశారు.
- మందమర్రి మండలంలోని మామిడిగట్టు, చిర్రకుంట, ఆదిల్‌పేట్, బొక్కలగుట్ట, అందుగులపేట్‌లో జరిగిన గ్రామసభల్లో ఆరు గ్యారెంటీలపై అధికారులను గామస్తులు నిలదీశారు.
- చెన్నూర్‌లోని 17వ వార్డులో 308మంది దరఖాస్తు చేసుకుంటే 22 మందినే ఎంపిక చేశారని అందులోనూ అనర్హులే ఉన్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- దహెగాం మండలం కల్వాడ గ్రామంలో రేషన్ కార్డుల కోసం 120 మంది దరఖాస్తు చేసుకోగా అందులో కేవలం 30 మందికి రావడంపై అధికారులను గామస్తులు నిలదీశారు. పోలీసులకు అక్కడికి చేరుకొని సముదాయించారు.
- రెబ్బెన గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 1233 మంది లబ్ధిదారులకు దరఖాస్తు చేసుకోగా 463 మందినే గుర్తించడంపై గ్రామస్తులు ఆందోళనకు దిగారు.
- ఇందిరమ్మ కమిటీ రద్దు చేసి అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారితో కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని చింతలమానేపల్లి మండలంలోని బూరెపల్లిలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. బాలాజీ అనుకోడలోనూ నిరసన తెలిపారు.
- కౌటాల మండలంలోని గుడ్లబోరి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకపోవడంపై గ్రామస్తులు డీటీ మస్కుర్ అలీని ప్రశ్నించారు.



మందమర్రిరూరల్ : అందుగులపేటలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



చింతలమానేపల్లి : బూరెపల్లిలో ఇందిరమ్మ కమిటీ రద్దు చేయాలని నిరసన



చెన్నూర్ 17వ వార్డులో అధికారులను నిలదీస్తున్న మహిళలు



కౌటాలలో అధికారులను నిలదీస్తున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య



జన్నారం : తపాలాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## లిస్టులో ఉన్నోళ్లందరికీ వచ్చినట్లు కాదు

- ఇది కేవలం తీసుకున్న డేటానే
- తపాలాపూర్ సభలో ఆర్‌ఐ వ్యాఖ్యలు
- నిలదీసిన గ్రామస్తులు



తపాలాపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌ఐ గంగారాజా

మంచిర్యాల, జనవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. 'ఈ జాబితాలో ఉన్నోళ్లందరూ ఇల్లు ఉన్నవారే.. ఇల్లు లేనోళ్లు ఎవరూ లేరు. అసలు ఈ జాబితా మీకు ఎక్కడి నుంచి వచ్చింది. ఎవరి నుంచి తీసుకున్నారు. ఇల్లు ఉన్నోళ్లకే మళ్లీ ఇందిరమ్మ ఇల్లు వస్తే మరి లేనోళ్లం ఏం కావాలి ? అంటూ జన్నారం ఆర్‌ఐ గంగారాజాను గ్రామస్తులు ప్రశ్నించారు. ఇందుకు ఆర్‌ఐ స్పందించి మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పుడే మొదలైంది. జాబితాలో పేర్లు వచ్చినోళ్లందరికి వచ్చినట్లు కాదు. పేర్లు లేనోళ్లకు రానట్లు కాదు. ఇది కేవలం మొన్న చేసిన సమగ్ర సర్వే ప్రకారం వచ్చిన డేటా.. ఎవరిదైనా మిస్ అయితే అయింది కావచ్చు.. ఎన్నో వందల పేర్లలో ఒక పేరు మిస్ అవుతది.. దీంతో అంతా అయిపోయినట్లు కాదు. మీరు అప్లికేషన్ ఇవ్వండి నేను తీసుకుంటాను.' అని తెలిపారు. ఎన్ని సార్లు దరఖాస్తులు ఇవ్వాలంటూ ఆర్ ఐపై గ్రామస్తులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి సమక్షంలో అర్హులను ఎంపిక చేస్తామని ఆర్‌ఐ చెప్పడం, పోలీసులు సైతం సర్ది చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. సభ అనంతరం ఈ సభలు, జాబితాలు అన్ని ఉత్తవే... పంచాయతీ ఎన్నికల కోసం వేస్తున్న ప్రయత్నాలంటూ జనాలు మాట్లాడుకోవడం కనిపించింది.

## తప్పుడు కేసులు పెడితే ఊరుకోం

- ఎమ్మెల్యే కనుసన్నల్లో పోలీస్ వ్యవస్థ
- బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు కందుల ప్రశాంత్‌పై తప్పుడు కేసు నమోదు
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, జనవరి 21: తప్పుడు కేసులు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మంగళవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నస్పూర్ బీఆర్‌ఎస్ యూత్ విభాగంలో చురుకుగా పనిచేస్తున్న కందుల ప్రశాంత్‌పై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తీగల్‌పహాడ్ ఏఎస్‌ఆర్ ఆర్ నగర్‌కు చెందిన తాళ్లపల్లి శ్రావణి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని, ఈ కంపెనీలో ఆమె ఫేక్ డాక్యుమెంట్లు పెట్టిందని ఉద్యోగం ఇవ్వకుండా ఆపారని, దీనికి కారణం దుర్గం వెంకటేశ్వర్లు అని ఆమె కందుల ప్రశాంత్‌కు తెలిపింది. శ్రావణి, ఆమె తల్లి, కందుల ప్రశాంత్ ముగ్గురు కలిసి వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి అడిగారని తెలిపారు. అతని వద్ద ఉన్న ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ తీసుకుని పరిశీలించగా వెంకటేశ్వర్లు ఇదంతా చేశాడని పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు కందుల ప్రశాంత్ కులం పేరుతో దూషించాడని కాంగ్రెస్ నాయకులు దుర్గం వెంకటేశ్వర్లు చేత తప్పుడు అట్రాసిటీ కేసు పెట్టించారని ఆరోపించారు. ఇదంతా ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరిగిందని, పోలీసులు అర్ధరాత్రి విచారణ చేపట్టడం వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని ఆరోపించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తప్పుడు కేసులు పెడితే న్యాయస్థానంలో భంగపాటు తప్పదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరినీ వదిలిపెట్టబోమన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోలీస్ పాలన నడిపిస్తున్నారని, కేసులకు భయపడేదిలేదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే దాడులు, బెదిరింపులు, సెటిల్‌మెంట్ల వ్యవహారాలకు సంబంధించిన చిట్టా మొత్తం తన వద్ద ఉందని, సమయం వచ్చినప్పుడు బయటపెడతానని చెప్పారు. అనంతరం కందుల ప్రశాంత్ భార్య అనూష మాట్లాడుతూ తన భర్తను అన్యాయంగా కేసులో ఇరికించారని, ఏ తప్పు చేయని తన భర్తను జైలు నుంచి విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్, నాయకులు వంగ తిరుపతి, గోగుల రవీందర్ రెడ్డి, పానుగంటి సత్తయ్య, హైమద్, పెరుమాళ్ల జనార్దన్, అకునూరి సంపత్‌కుమార్, అడ్లకొండ రవిగౌడ్, ముక్కెర వెంకటేశ్, బాకం నగేశ్, తిప్పని తిరుపతి, ఎండీ రఫీక్ ఖాన్, జాడి భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు ఆందోళన

తాండూర్, జనవరి 21 : పత్తి కొనుగోళ్లలో పరిమితి విధిస్తున్నారంటూ తాండూర్ మండలంలోని రేపల్లెవాడ శివారులోని జిన్నింగ్ మిల్లు వద్ద సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పత్తి కొనుగోలు కేంద్రంలో మంగళవారం కౌలు రైతులు ఆందోళన చేపట్టారు. పత్తి అమ్మకానికి వచ్చిన కౌలు రైతుల వద్ద 40 క్వింటాళ్లకు పైగా పత్తి ఉంటే కొనబోమని సీసీఐ అధికారులు పేర్కొనడంతో వివాదం మొదలైంది. దీంతో కొద్దిసేపు కౌలు రైతులకు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్ యజమానులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కొద్దిసేపు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ సిబ్బందితో అక్కడ చేరుకొని విషయం అడిగి తెలుసుకున్నారు. సీసీఐ అధికారులు, యజమానులతో మాట్లాడి కొనుగోళ్ల ను కొనసాగించడంతో రైతులు శాంతించారు.



సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న కౌలు రైతులు